క్లుప్తంగా

చంద్రగిరి సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ రాజశేఖర్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి సీఐగా రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పాకాల సీఐగా ఉన్న రాజశేఖర్ బదిలీపై చంద్రగిరికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఓబులేసు పాకాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐకు పలువురు రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. సత్వర న్యాయం, వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అసాంఘీక కార్యకలాపాలు, గంజాయి, జూదం వంటి వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

పెళ్లి కానుక అందజేత


పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: మండలంలోని దామలచెరువు పంచాయతీ రెడ్డివారి వీధిలో వివాహం చేసుకోనున్న జంటకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను అందజేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన వధూవరులు ఎస్.తాహీర్‌బాషా, ఫర్హానా కోసం నల్లపూసల దండ, వెండి మెట్టెలు, వస్త్రాలు, గాజులు, గ్రీటింగ్ కార్డు, స్వీట్స్‌ను వరుడు తల్లిదండ్రులకు అందజేశారు. వైస్ ఎంపీపీ నాగూర్‌బి, వైస్ సర్పంచ్ ఇమ్రాన్, కో–ఆప్షన్ సభ్యుడు కాజా మస్తాన్ పాల్గొన్నారు.

గౌరవాధ్యక్షుడిగా మురళీరెడ్డి


మురళీరెడ్డిని సత్కరిస్తున్న సంఘం నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ హాస్టల్ ఎన్ఎంఆర్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడిగా వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీరెడ్డి ఎన్నికయ్యారు. ఎస్వీయూలో జరిగిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. 2014లోపు ఐదేళ్ల సరీ్వస్ ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగరాజు, గౌతమి, కార్యదర్శి కంచి లోకేష్, ఉపాధ్యక్షులు గౌరి, గిరిబాబు, చిరంజీవి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రాజారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు


రాజారెడ్డిని సత్కరిస్తున్న మహిళా వర్సిటీ వీసీ

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరించిన ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డిని బుధవారం మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.భారతి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. డీన్‌లు సుజాత, అనూరాధ, డిప్యూటీ రిజిస్ట్రార్లు, డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు, సెక్షన్ హెడ్‌లు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

మురుగుకాలువ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో పరిశుభ్ర చంద్రగిరి లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు చిలకూరి యుగంధర్‌రెడ్డి తెలిపారు. తుడా నిధులు రూ.12 లక్షలతో చంద్రగిరి ఆకుతోట వీధిలో నిర్మించనున్న మురుగుకాలువ పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సింధు, పార్టీ నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బండారు చంద్ర, వేమారెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌పై కేసు

ఏర్పేడు: నిర్లక్ష్యంగా బస్సును నడుపుతూ మోటార్ సైకిలిస్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. ఈ నెల 18న సూళ్లూరుపేట డిపోకు చెందిన బస్సు డ్రైవర్ లోకనాథం శ్రీకాళహస్తి నుంచి రేణిగుంట వైపు వేగంగా వెళుతూ ఏర్పేడులోని వెంకగిరి రోడ్డు కూడలిలో వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిలిస్టు చంద్రయ్య, లక్ష్మీదేవికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

యోగా ఆరోగ్య సంజీవని

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

తిరుపతి తుడా: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తిరుపతి నగర పాలక సంస్థ, జిల్లా యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి ప్రకాశం పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. యోగా సాధన మానసిక, శారీరక రుగ్మతలకు సంజీవనిలా పనిచేస్తుందన్నారు. యోగా మన దేశ సంపదన్నారు. నేడు ప్రపంచ మొత్తం యోగా ప్రాముఖ్యతను గుర్తించి ఆచారిస్తుండడం మనందరికీ గౌరవం అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సంగీతంతో కూడిన యోగా విన్యాసాలతో ఆకట్టుకున్నారు. వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి యోగా అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, కల్పలత, కిరణ్ కుమార్, హైమావతి, శివ పాల్గొన్నారు.

–కోర్టు ఆవరణలో..

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ మాట్లాడుతూ.. ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో తోడ్పడుతుందన్నారు. తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగం


శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో..

తిరుపతి కల్చరల్: ప్రతి మనిషి ఆరోగ్యకర జీవిత పయనానికి యోగా ఎంతో అవసరమని సెట్విన్ సీఈఓ వి.మురళీక్రిష్ణ అన్నారు. యువజన సర్వీసుల శాఖ సెట్విన్, ఆయుష్, జిల్లా క్రీడా, ఎడ్యుకేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఎస్వీయూ రిటైర్డ్ వీసీ ఆర్.రామమూర్తి, చీఫ్ కోచ్ సయ్యద్, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో..

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో వ్యాయామ విద్య విభాగాధిపతి జి.సారా సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్సిటీ వీసీ డి.భారతి, రిజిస్ట్రార్ ఎన్.రజని, డీన్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ సుజాతమ్మ హాజరయ్యారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వీసీ తెలిపారు.

యోగా సకల రోగ నివారిణి

తిరుచానూరు(చంద్రగిరి): యోగాతో రోగాలను నివారించుకోవచ్చని యోగా గురువులు భూపతి, నవీన్ అన్నారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఏఓ ఖాదర్‌వల్లీ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

తిరుపతి కల్చరల్: నిత్యం యోగా సాధన చేస్తే పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని చిత్తూరు జిల్లా యోగా అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు తెలిపారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్, యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యోగా శిక్షకులు హైమావతి, జేసీఐ సభ్యురాలు తహసీన్ యోగాసనాలను నేర్పించారు. సైన్స్ క్యూరేటర్ సుదీప్తో సాహా, జేసీఐ అధ్యక్షుడు గుణశేఖర్, జోనల్ హెడ్ హర్షవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శేషసాయి, పావని, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


సైన్స్ సెంటర్‌లో..

తిరుపతి కల్చరల్: శరీరాన్నీ, మనస్సునూ బ్యాలెన్స్ చేసే శక్తి యోగాకు మాత్రమే ఉందని ఇఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.శ్రీనాథ్ అన్నారు. ఆర్ఎంఓ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్లు రమేష్ కుమార్, సునీత, ఎన్ఎస్ అమ్ములు, నోయెల్ వినోద్, పాల్గొన్నారు.

భాకరాపేట: మండలంలోని చిట్టిచెర్లలో జరిగిన కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్ రెడ్డి, ఎంపీడీఓ దేవేంద్రబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే ఎర్రావారిపాళెం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంపీడీఓ అమరన్నాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య పాల్గొన్నారు.

పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు యోగా వల్ల కలిగే లాభాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ సురేంద్ర, యోగా గురువు ఆదిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.




ప్రకాశం పార్కులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో.., తిరుపతిలో యోగా చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు




పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..., అవగాహన ర్యాలీలో డీఎంహెచ్ఓ శ్రీహరి, వైద్య సిబ్బంది, తిరుపతిలో కేక్ కట్ చేస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


విజేత జట్టుకు ప్రైజ్ మనీ అందజేస్తున్న అభినయ్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎస్వీజేఎస్ఎం క్రికెట్ మైదానంలో ఆరు రోజులుగా నిర్వహించిన పసుపులేటి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. వినోద్–11 జట్టు, తల–11 జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో వినోద్–11 జట్టు గెలుపొందింది. విజేత జట్టు రూ.లక్ష, ట్రోఫీని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ అందజేశారు.

ఎంఈఓ–2గా లింగయ్య


ఎంఈఓలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల: ఎంఈఓ–2గా లింగయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇద్దరు ఎంఈఓలు ఉండడం వల్ల పరిపాలన సులభతరం అవుతుందన్నారు. ఉపాధ్యాయులు బాగా పనిచేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఇద్దరు ఎంఈఓలను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ లీలారాణి

చంద్రగిరి(తిరుపతి రూరల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ లీలారాణి అన్నారు. బుధవారం చంద్రగిరి బీసీ బాలుర వసతి గృహంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉన్నతంగా చదువుకోవాలన్నారు. బయట వ్యక్తుల మాటలు నమ్మి డ్రగ్స్, మద్యం, ఇతర మరకద్రవ్యాలకు అలవాటు పడకూడదన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న వివిధ రకాల సిబ్బంది

తిరుమల: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐటీబీపీ యోగా శిక్షకులు వెల్లడించారు. భారత ప్రభుత్వ హోంశాఖ పరిధిలోని ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో తిరుమల ఆస్థాన మండపంలో బుధవారం ఉదయం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీబీపీ ఇన్‌స్పెక్టర్ వైవీ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కలికిరి వద్ద గల ఐటీబీపీ 53వ బెటాలియన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ×అందరికీ యోగా్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నిత్యజీవితంలో యోగా సాధన చేసి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందాలని కోరారు. ముందుగా ఐటీబీపీకి చెందిన యోగా శిక్షకులు యోగాసనాలు చేయించారు. ఐటీబీపీ సిబ్బందితో పాటు టీటీడీ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొని ఆసనాలు వేశారు. కార్యక్రమంలో ఐటీబీపీ 53వ బెటాలియన్ కమాండెంట్ అమిత్ భాటి, డెప్యూటీ కమాండెంట్ ఆయుష్ దీపక్, టీటీడీ ఏపీఆర్ఓ కుమారి పి.నీలిమ, ఇన్‌స్పెక్టర్ వైవీ రెడ్డి, యోగా శిక్షకులు దినేష్ జోషి, సూరజ్ సింగ్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా వినాయక సాగర్

- ఆధునిక వసతులతో స్విమ్మింగ్ పూల్
- కమిషనర్ హరిత


వినాయక సాగర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలో అభివృద్ధి చేస్తున్న వినాయక సాగర్‌ను ప్రముఖ పర్యటక కేంద్రంగా అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. బుధవారం వినాయకసాగర్ అభివృద్ధి పనులతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సాగర్ పనులు నత్తనడకన సాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేగంగా పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్‌ను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాలని ఇంజినీర్లకు సూచించారు. లాన్‌లు, గార్డెనింగ్ పనులు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. అలాగే ఐలాండ్ వెళ్లే మార్గంలో డబుల్ బారికేడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సాగర్‌లోని చెత్తను తొలగించే పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం లీలామహల్ కూడలి నుంచి కరకంబాడి మార్గంలో ఫుట్‌పాత్‌లు, డ్రైయినేజీ కాలువలను పరిశీలించారు. ఆక్రమణలు తొలగించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ.. నగర ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతంగా వసతులు పెరుగుతాయని తెలిపారు. ఆమె వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఉన్నారు.

● ఆకాశ అందాలు



ఓ వైపు కారు బబ్బులు.. మరోవైపు ఇంద్ర ధనస్సుతో బుధవారం సాయంత్రం తిరు అందాలు కనువిందు చేశాయి. ఉదయం నుంచి చిరుజల్లులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఆ తర్వాత కారు బబ్బులు కమ్ముకుని ఇలా దర్శనమిచ్చింది. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–మోహన్‌కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి

మూగజీవాల దాహార్తి తీర్చడానికి పైప్‌లైన్


పైప్‌లైన్ ఏర్పాటు చేయిస్తున్న ప్రతాప్ స్వామీజీ

రామచంద్రాపురం: మూగజీవాల దాహార్తి తీర్చడానికి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీప్రతాప్ స్వామిజీ అన్నారు. బుధవారం రాయలచెరువు సమీపంలోని యోగుల పర్వతంపైకి చెరువులోని నీటిని తరలించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అడవిలోని జంతువులు, ఆవులు, వానరాలు తాగునీటి కోసం అలమటిస్తున్నాయని అన్నారు. ఈ పైప్‌లైన్ వల్ల మూగజీవాలకు నీరు అందుబాటులో ఉంటుందని చెప్పారు. రాయలచెరువు సర్పంచ్ మురగయ్య ఉన్నారు.

గంగమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాత వంశీసాయి

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనుల నిమిత్తం తిరుపతికి చెందిన ఐ.వంశీసాయి రూ. లక్ష విరాళం అందజేశారు. నగదును బుధవారం ఆలయ ఈఓ ఎం.మునిక్రిష్ణయ్యకు ఇచ్చారు. దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

హంస వాహనంపై పరాశరేశ్వరుడు

నారాయణవనం: పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం సాయంత్రం హంస వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


నరేంద్ర (ఫైల్)

తిరుచానూరు(చంద్రగిరి): మానసిక దివ్యాంగ యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తిరుచానూరు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ ఆశ్రమంలో నరేంద్ర(19) కొంత కాలంగా ఆశ్రయం పొందుతున్నాడన్నారు. రెండు రోజుల క్రితం నరేంద్ర ఆశ్రమం నుంచి కనిపించకుండా పోవడంతో నిర్వాహకులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదృశ్యమైన యువకుడు తన పేరు తప్ప మరెలాంటి వివరాలను తెలపలేదని, సరిగ్గా మాటలు రావన్నారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు సీఐ శివప్రసాద్ రెడ్డి–94407 96755, ఎస్ఐ వెంకట సుబ్బయ్య–93479 49532 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

చిట్టేచెర్ల ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా రోజారాణి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా రోజారాణి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి, ఎంపీడీఓ దేవేంద్రబాబు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రామంలో ఇసుక తరలిస్తే ఊరుకోం


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీషా, సీఐ

చంద్రగిరి(తిరుపతి రూరల్): తమ గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్‌లు పెట్టి ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని రెడ్డివారి పల్లె, నరసింగాపురం గ్రామస్తులు హెచ్చరించారు. జేపీ పవర్ వెంచర్స్ లిమిటెడ్ అధికారులు బుధవారం రెడ్డివారి పల్లి సమీపంలో రీచ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. దీనిని గ్రామస్తులు అడ్డుకున్నారు. మా గ్రామంలో ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని, భూగర్భ జలాలు అడుగంటి తాగడానికి నీరు లేకుండా పోతుందని సర్పంచ్‌లు రేవతి ప్రకాష్‌రెడ్డి, చెంచురత్నం, గ్రామస్తులు వాపోయారు. చంద్రగిరి తహసీల్దార్ శిరీష, సీఐ రాజశేఖర్ సంఘటన స్థలాన్ని చేరుకుని గ్రామస్తులతో చర్చలు జరిపారు. ఇసుక రీచ్ వల్ల భవిష్యత్తులో జరిగే తీవ్ర పరిణామాలపై గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

వైభవంగా ద్రౌపది కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రామచంద్రాపురం: సీరామాపురంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం ద్రౌపది కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పట్టు పీతాంబరాలు, సుగంధభరిత పుష్పమాలికలు, వివిధ రకాల ఆభరణాలతో ద్రౌపది, ధర్మరాజుల ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలుగా కొట్టే నరసింహారెడ్డి, తేజోవతి దంపతులు వ్యవహరించారు.

వాహనం సహా సారా స్వాధీనం

–ముగ్గురి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎర్రావారిపాలెం మండలం ఆర్ఎం తాండలో సారా కలిగి ఉన్నారని సమాచారం మేరకు చంద్రగిరి స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. పది లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో నిందితుల అరెస్ట్ చూపించారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ లీలారాణి మాట్లాడుతూ.. ఆర్ఎం తాండాలో పీలేరు మండలం మేళ్లచెరువుకు చెందిన బాలరాజు, ఐరగంరెడ్డి, మాన్యం తాండాకు చెందిన గోపి నాయక్ రెడ్డి స్కూటర్‌పై సారా విక్రయించేందుకు ప్రయత్నించారన్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అరెస్ట్ చేసి, వారి దగ్గర ఉన్న సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎస్ఐ చైతన్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, గురప్ప, శివప్రసాద్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.